ఎకరానికి రూ.20 లక్షలు ఇవ్వాలి

- భూములు కోల్పోతున్న రైతుల డిమాండ్
- రైతులు సహకరించాలి : ఆర్డీఓ సుబ్రహ్మణ్యం


రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సుబ్రహ్మణ్యం

6


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రేమలత

పెండింగ్ కేసుల పరిష్కారానికే
లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రేమలత

గద్వాల క్రైం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల సత్వర పరిష్కారం కోసమే లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ ఎన్. ప్రేమలత అన్నారు. బుధవారం జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీనివాస్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 13న గద్వాలలోని న్యాయస్థాన ప్రాంగణంలో నిర్వహిస్తున్న లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాజీ పద్ధతిలో అన్ని రకాల కేసులు జాతీయ లోక్‌అదాలత్‌తో పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో కేసులను పరిష్కరించుకొని తమ సమయాన్ని, డబ్బులను ఆదాచేసుకోవాలన్నారు. గతంలో 8,195 కేసులు పరిష్కరించి మన జిల్లా రాష్ట్రంలో 11వ స్థానంలో నిలిచిందన్నారు. జిల్లా ప్రజలు తమ కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకొని శాంతియుతంగా, సంతోషంగా జీవించాలన్నారు.

14న ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ ఎంపికలు

7

ఆపదలో..
క్రిటికల్ కేర్

భవనం వెనకాలే వరద కాలువ

- వానొస్తే భవనం చుట్టూ నిలుస్తున్న నీరు
- టీహబ్, ఎంసీహెచ్ కేంద్రాల్లోకి చేరుతున్న వరద
- సీసీ రోడ్డు పైకి.. భవన పునాది కిందకి
- వర్షాకాలంలో ఇబ్బందులు పడనున్న రోగులు
- ప్రారంభానికి ముందే సమస్యల్లో భవనం


చిన్నపాటి వర్షానికే క్రిటికల్ కేర్ యూనిట్ భవనం వద్ద నిలిచిన నీరు

వనపర్తి వైద్యవిభాగం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులకు మెరుగైన వైద్యం అందించడం కోసం బీఆర్ఎస్ హయాంలో క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ భవనం వనపర్తి మునిసిపాలిటీ పరిధిలోని నర్సింగాయపల్లి శివారులో నిర్మించారు. ఈ భవనం వెనకాలే వరద కాలువ ఉంది. స్థల ఎంపికలో చేసిన పొరపాటు వల్లన నేడు ఇబ్బందులు తప్పేటట్లు లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా భవనం చుట్టూ నీరు నిలవడంతో కోట్ల రూపాయల నిధులతో నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ ఆపదలో పడినట్లుందని స్థానికులు వాపోతున్నారు.

రూ. 23.75 కోట్ల నిధులతో..

వనపర్తి పట్టణ పరిధిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం వెనకాల నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ కోసం రూ. 23.75 కోట్లు మంజూరు చేశారు. వాటిలో భవన నిర్మాణానికి రూ. 12.60 కోట్లు, అధునాతన పరికరాల కోసం రూ.7 కోట్లు ఖర్చు చేశారు. జీఎస్టీకి మిగతా నిధులు వెళ్లినట్లు అధికారులు తెలిపారు. 2022 సంవత్సరంలో టీఎస్ఎం ఎస్ఐడీసీ ద్వారా నిర్మాణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం భవన నిర్మాణం పూర్తి చేశారు. బయటి పనులు (గ్రావెల్, పింత్) జరగాల్సి ఉంది. అంతేకాకుండా భవనానికి విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేసి, ప్యానల్ బోర్డులు నిర్మిస్తే పనులన్నీ పూర్తి అవుతాయి.

భవనం వెనకాలే వరద కాలువ..

క్రిటికల్ కేర్ యూనిట్ భవనం వెనకాల నల్ల చెరువుకు వచ్చే వరద కాలువ ఉంది. వర్షాకాలంలో ఈ కాలువ నిత్యం ప్రవహిస్తునే ఉంటుంది. అంతేకాకుండా డీ-8 కాలవ నుంచి నీటి విడుదల చేసి ఈ కాలువ నుంచే నల్ల చెరువును నింపుతుంటారు. కాలువ ప్రవహించిందంటే భవనం చుట్టూ నీరు చేరుతోంది. భవన నిర్మాణ సమయంలో ఇసుకకు బదులు డస్ట్ వాడటం వల్ల ప్రారంభానికి ముందే గోడలు తమ్మి వస్తున్నాయి. ముఖ్యంగా భవనానికంటే సీసీ రోడ్డు ఎత్తులో నిర్మించారు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా టీ హబ్, ఎంసీహెచ్ కేంద్రాల్లోకి చేరుతున్నాయి. ఈ పరిస్థితిని చూసిన స్థానికులు కోట్ల రూపాయలు ఖర్చు చేసి కష్టాలు కొని తెచ్చుకున్నట్లు ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల ప్రమేయం లేకుండానే..



గతంలో వైద్యాధికారుల ప్రమేయం లేకుండానే క్రిటికల్ కేర్ భవన నిర్మాణం చేశారు. అప్పుడు నేను సూపరింటెండెంట్‌గా కూడా లేను. కానీ వర్షాలు వచ్చిన ప్రతీసారి భవనం చుట్టూ వరద నీరు చేరుతోంది. ఇలాంటి స్థలంలో నిర్మాణం ఎప్పటికైనా ప్రమాదమే. ప్రస్తుతం భవన నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి చేశారు. ఇప్పుడు ఏమీ చేసినా ఉపయోగం లేదు.

-డాక్టర్ రంగారావు, జీజీహెచ్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్, వనపర్తి


క్రిటికల్ కేర్ యూనిట్ భవనం చుట్టూ చేరిన వర్షపు నీరు

యూరియా కోసం..
రోడ్డెక్కిన రైతన్న


యూరియా కోసం అమరచింతలో వర్షంలో బారులు తీరిన రైతులు

7

అన్ని వసతులు కల్పిస్తాం

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి


విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

గోపాల్‌పేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు కావలసిన అన్ని వసతులు కల్పిస్తామని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండలంలో బుద్దారం సమీపంలోని బాలికల గురుకుల పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఎలుకలు కరిచిన విషయంపై విద్యార్థులతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఎలుకలను చూశాం.. కానీ అవి కరిచాయనే విషయం తెలియదన్నారు. ముందు జాగ్రత్తగా గోపాల్‌పేటలోని పీహెచ్‌సీలో వైద్యం చేయించుకున్నామని కలెక్టర్‌కు తెలిపారు. మా పాఠశాలకు ప్రహరీ, సెప్టిక్‌ట్యాంక్ నిర్మిస్తే బాగుటుందని విద్యార్థులు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ మీకు కావలసిన అన్ని సదుపాయాలను సమకూరుస్తామని, మీరు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ

వనపర్తి/వనపర్తి రూరల్: సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో సైబర్ పోలీస్ వారియర్స్‌కి టీ షర్ట్స్ అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ... జిల్లావ్యాప్తంగా ప్రతీ గ్రామంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా వనపర్తి మండలంలోని చిట్యాల గ్రామ శివారులోని బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. డీసీఆర్‌బీ డీఎస్పీ మహేశ్వరరావు, సైబర్ క్రైం ఎస్ఐ రవి ప్రకాష్, డీసీఆర్‌బీ ఎస్ఐ తిరుపతిరెడ్డి, వనపర్తి సీఐ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

ఆదాయ వనరులపై..
దృష్టి సారించాలి

- వినూత్న కార్యక్రమాలతో సమృద్ధి సాధించాలి
- రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య
- ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, స్థానిక సంస్థల అధికారులతో సమీక్ష

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానికంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకుంటూ, ఆదాయ వనరులను పెంపొందించుకునే దిశగా వినూత్న ఆలోచనలు, పద్ధతులతో స్థానిక సంస్థలు పనిచేయాలని రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య చెప్పారు. మహబూబ్‌నగర్ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల అధికారులతో రాజయ్య సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు ఎం.రమేశ్, రమేశ్, సంకిపల్లి సుధీర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి, నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్, వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి, గద్వాల బీఎం సంతోష్, నారాయణపేట అదనపు కలెక్టర్ రెవెన్యూ, జిల్లాల వారీగా స్థానిక సంస్థల పనితీరు గురించి చైర్మన్‌కు వివరించారు. మునిసిపల్

(మిగతా 6లో..)

భారీ వర్షం

- నాగర్‌కర్నూల్ పట్టణంలో జలమయమైన రోడ్లు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ పట్టణంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పట్టణంలో 40.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. దీంతో పట్టణంలోని రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగిపొర్లాయి. వర్షానికి వాహదారులు, పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పట్టణంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ సమీపంలోని పెట్రోలు బంకు ముందు ప్రధాన రోడ్డుపై దాదాపు రెండు అడుగుల లోతు వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడ్డారు.


రాంనగర్‌కాలనీలో జలమయమైన రోడ్డు


బస్టాండు కూడలిలో జలమయమైన ప్రధాన రహదారి



నాగర్‌కర్నూల్ పట్టణంలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం వద్ద ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

ధర దడ

- మండుతున్న కూరగాయల ధరలు
- పచ్చి మిర్చి కిలో రూ.100, బీన్స్ రూ.90



6

నడిగడ్డ యువత అన్ని రంగాల్లో రాణించాలి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి
- 'ఏ కన్ను చూడదనా' షూటింగ్ ప్రారంభం

7

ప్రజాపాలన పేరుతో మోసం

- కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

అమ్రాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తోందని నాగర్ కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ ఉమ్మడి అమ్రాబాద్ మండల కార్యకర్తల సమావేశానికి హాజరై మాట్లాడారు. 21 నెలల కాంగ్రెస్ పాలనలో ఇచ్చిన హామీలల్లో ఏ ఒక్కటీ పూర్తి స్థాయిలో నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన ఆరు గ్యారెంటీలు, 420హామీలను ప్రజలకు వివరిస్తూ ముందుకు పోవాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన సూచించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి మండలంలో మెజార్టీ స్థానాలను సాధించే దిశగా దృష్టి సారించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో తిరిగి అధికారం చేపట్టడం ఖాయమని ఎవరు భయపడాల్సినవసరం లేదని కార్యకర్తలకు మనోధైర్యం కల్పించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నరసింహ గౌడ్, మండల నాయకులు చెన్నకేశవులు, రవీందర్‌రెడ్డి, వెంకటయ్యయాదవ్, కిట్టు పటేల్, జయరాం, పార్టీ నాయకులు, కార్య కర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

రేవల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రేవల్లి మండలంలోని తలుపునూరు గ్రామంలో బుధవారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు బోనాలను అందంగా అలంకరించుకొని గ్రామ పెద్దలు యువకులతో కలిసి ఊరేగింపు చేస్తూ పోచమ్మ తల్లి గుడి దగ్గరికి వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ ఉత్సవాలలో భాగంగా గురువారం మైబూసుల దర్గా ఉత్సవాలు, శుక్రవారం వనుముల లక్ష్మీదేవతకు బోనాల ఉత్సవంతో పండుగ ముగుస్తుందని గ్రామస్థులు తెలిపారు.

కుష్ఠు వ్యాధి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

వ్యాధి నివారణ రాష్ట్ర కమిటీ సభ్యుడు సమాపత్



కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కల్పిస్తున్న బృందం సభ్యులు

వనపర్తి వైద్యవిభాగం, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుష్ఠు వ్యాధి రహిత సమాజం కోసం వైద్య సిబ్బందితో పాటు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని కుష్ఠు వ్యాధి నివారణ రాష్ట్ర సభ్యుడు డాక్టర్ సమాపత్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పీర్లగుట్ట, గాంధీనగర్ అర్బన్ హెల్త్ సెంటర్లను కుష్ఠు వ్యాధి నివారణ బృందం సభ్యులు పరిశీలించారు. కేంద్రాలలోని ఏఎన్ఎం, ఆశ, యూపీహెచ్‌సీ సిబ్బందికి కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఎల్‌సీడీసీ సర్వేపై ఏఎన్ఎం, ఆశలకు వివరించారు. రికార్డులను పరిశీలించి తగు సూచనలు చేశారు. డిప్యూటీ పీఎంవో వెంకటేశ్వరచారి, సకలరెడ్డి, జిల్లా అధికారులు కృష్ణయ్య, డాక్టర్ క్లైవిన్, ఏఎన్ఎంలు సత్యమ్మ, జ్యోతి, సుమిత్ర, గంధం అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎకరానికి రూ.20 లక్షలు ఇవ్వాలి

- భూములు కోల్పోతున్న రైతుల డిమాండ్
- రైతులు సహకరించాలి : ఆర్డీఓ సుబ్రహ్మణ్యం

వీపనగండ్ల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఎకరానికి రూ. 20 లక్షల పరిహారం ఇవ్వాలని లింక్ కెనాల్‌లో భూములు కోల్పోతున్న రైతులు డిమాండ్ చేశారు. సింగోటం, గోపాల్‌దిన్నె రిజర్వాయర్ల అనుసంధాన కాలువ నిర్మాణంలో వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలంలోని బొల్లారం, కొర్లకుంట, సంగినేనిపల్లి, తూముకుంట, తెల్లరాళ్లపల్లి గ్రామాల పరిధిలో వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నాయి. మండలంలోని వీపనగండ్ల రైతు వేదికలో బుధవారం ఆయా గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ లింక్ కెనాల్ నిర్మాణానికి సహకరించాలని కోరారు. ప్రభుత్వం ఎకరానికి రూ. 8 లోల నుంచి రూ. 9 లక్షల వరకు పరిహారం ఇచ్చే అవకాశం ఉందని తెలిపారు. అందుకు రైతులు అభ్యంతరం తెలిపారు. భూముల ధరలు పెరిగాయని, పరిహారం ఇంతే ఇస్తే నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. సమావేశంలో తహసీల్దార్ వరలక్ష్మి పాల్గొన్నారు.

పెట్టుబడి పేరుతో మోసం

పెబ్బేరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : గ్లోబల్ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పేరుతో ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు ముంచేశారు. ఈ సంఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పెబ్బేరు ఎస్ఐ గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలంలోని కంచిరావు పల్లి గ్రామానికి చెందిన రాజమౌళి బాలకృష్ణ గత ఏడాది జూన్ 1న 'టెలిగ్రామ్' నుంచి 'గ్లోబల్ ట్రేడింగ్' అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నాడు. అందులో మొదట రూ.1000 డిపాజిట్ చేయగా, అతడి ఖాతాల్లో రూ.1300 జమ అయ్యింది. దీంతో ఎక్కువ లాభం వస్తుందని భావించి, విడతల వారీగా రూ. 81 వేలు డిపాజిట్ చేశాడు. కానీ తిరిగి ఒక్క రూపాయి కూడా రాకపోవడంతో మోసపోయానని గ్రహించాడు. బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మొబైల్ ఫోన్ హ్యాక్

- రూ. 3 లక్షలు స్వాహా

పెబ్బేరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి మొబైల్ ఫోన్‌ను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు అతడి బ్యాంకు ఖాతాలో నుంచి డబ్బు స్వాహా చేశారు. ఎస్ఐ గంగిరెడ్డి యుగంధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, పెబ్బేరు మునిసిపాలిటీలోని వినాయకనగర్‌కు చెందిన వాకిటి వెంకటేశ్‌కు చెందిన మొబైల్ ఫోన్‌ను ఈ నెల 5న తన గుర్తు తెలియని వ్యక్తులు హ్యాక్ చేశారు. అతడి బ్యాంకు ఖాతాలో ఉన్న రూ. 3 లక్షలను డ్రా చేసుకున్నారు. విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

ఊర్కొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలోని రేవల్లి గ్రామ శివారులో ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రేవల్లి గ్రామ శివారులోని పాడుబడిన బావిలో బుధవారం ఓ మృతదేహాన్ని గమనించిన స్థానిక రైతులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్ఐ కృష్ణదేవ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. స్థానికులు, పోలీసు సిబ్బంది సహాయంతో మృతదేహాన్ని బయటికి తీశారు. అక్కడే ఉన్న కొందరు ఆమెను రేవల్లి గ్రామానికి చెందిన భవాని (26)గా గుర్తించారు. ఆమె 18 నెలల క్రితం భర్తతో విడాకులు తీసుకొని, తల్లిదండ్రుల వద్దే ఉంటోందని తెలిపారు. ఆమె మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతురాలి అత్తగారి ఊరు జకినాలపల్లి అని, ఆమెకు ఓ కుమార్తె ఉందని తెలిపారు.

ధర 'దడ'



నాగర్‌కర్నూల్ రైతుబజారులో కూరగాయలు విక్రయానికి ఉంచిన రిటైల్ వ్యాపారులు

- మండుతున్న కూరగాయల ధరలు
- పచ్చి మిర్చి కిలో రూ.100, బీన్స్ రూ.90

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పెరుగుతున్న కూరగాయల ధరలు ప్రజల గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి. సామాన్య, మధ్య తరగతి వినియోగదారులకు భారంగా మారాయి. గత రెండు నెలలతో పోల్చితే ప్రస్తుతం ధరలు గణనీయంగా పెరిగాయి. రైతు బజారులో బోర్డుపై సూచించిన ధరల కంటే రిటైల్ వ్యాపారులు రూ. 10 వరకు అదనంగా విక్రయిస్తున్నారు.

దీంతో వారానికి సరిపడా కూరగాయలు కొనాలంటూ రూ.500 కంటే ఎక్కువగానే ఖర్చు అవుతుందని ప్రజలు చెప్తున్నారు.

డిమాండును బట్టి ధర పెంపు

నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రైతుబజారులో విక్రయించే కూరగాయలకు ధరల పట్టికను ఏర్పాటు చేసినప్పటికీ, దానితో సంబంధం లేకుండా రిటైల్ వ్యాపారులు డిమాండ్‌ను బట్టి ధర పెంచి అమ్ముతున్నారు. రైతుబజారులో బుధవారం కిలో పచ్చి మిర్చి రూ.80 ఉన్నప్పటికీ, రూ.100కు విక్రయిస్తున్నారు.

అందరూ ఎక్కువగా వినియోగించే టమాటో నాణ్యతను బట్టి కిలో రూ.40 నుంచి రూ.50 వరకు అమ్ముతున్నారు. కిలో వంకాయ రూ.50, బెండ రూ.70, బీరకాయ రూ.60, దొండకాయ రూ.60 ధర పలుకుతున్నాయి. బీన్స్, ముల్లంగి, క్యారెట్ ధర రూ. 80 నుంచి రూ. 90 వరకు ఉంది. ఆకు కూరల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి.

గోంగూర, పాలకూర, తోటకూరలను కట్ట సైజును బట్టి రూ.20కి రెండు నుంచి నాలుగు కట్టలు ఇస్తున్నారు. కొత్తిమీర, పుదీనా కట్టకు సైజును బట్టి రూ.20 నుంచి 40 రూపాయల వరకు విక్రయిస్తున్నారు.

రైతుబాజరులో ప్రధాన కూరగాయల ధరలు ఇలా..

కూరగాయ	ధర (కిలోకు..రూ.)
టమాట	40
పచ్చిమిర్చి	80
వంకాయ	40
బెండకాయ	60
కాకరకాయ	60
బీరకాయ	50
దొండకాయ	50
ఆలుగడ్డ	38
బీట్‌రూట్	58
బీన్స్	90

అధిక వర్షాలతో దెబ్బతిన్న తోటలు

ఇటీవల కురుస్తున్న వర్షాల ప్రభావం కూరగాయల ధరలపై పడింది. జిల్లాలో గత నెల రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. దీంతో దిగుబడి గణనీయంగా తగ్గింది. స్థానిక మార్కెట్‌కు రావడమూ తగ్గిపోయింది. దీంతో ఆకు కూరలు తప్ప, ఇతర కూరగాయాల్లో అధికభాగం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని వ్యాపారులు చెప్తున్నారు. దీంతో రవాణా, దిగుమతి ఖర్చులు కలిపి కూరగాయల ధర ఎక్కువగా ఉంటోందని అంటున్నారు. కూరగాయల పంటలు నిలదొక్కుకొని, దిగుబడి పెరిగితే తప్ప ధరలు తగ్గే పరిస్థితి లేదని చెప్తున్నారు.

కొనలేకపోతున్నాం



సాధారణంగా ప్రతీ సంవత్సరం జూన్, జూలైలో కూరగాయల ధరలు పెరిగి, ఆగస్టులో తగ్గేవి. కానీ ఈ సారి మాత్రం కూరగాయల ధరలు విపరీతంగా పెరిగాయి. వారానికి సరిపడా కూరగాయలు కొనాలంటే రూ.500 ఖర్చవుతోంది. మా లాంటి సామాన్య, మధ్య తరగతి ప్రజలకు కష్టంగా ఉంది. అధికారులు స్పందించి రైతుబజారు లో నిర్ణయించిన ధరలకే కూరగాయలు అమ్మేలా చర్యలు తీసుకోవాలి.

- లక్ష్మణస్వామి, వినియోగదారుడు, నాగర్‌కర్నూల్

ఆదాయం వనరులపై దృష్టి సారించాలి

(5వ పేజీ తరువాయి)

పట్టణాలు, గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, తడి పొడి చెత్త సేకరణ, పచ్చదనం పెంపు, పన్ను వసూళ్లు, స్వయం ఉపాధి పథకాల అమలు, ప్రజల జీవన ప్రమాణాలు పెంపుకోసం కొనసాగుతున్న కార్యక్రమాలు, సమాకురుతున్న ఆదాయం, ఇతర మార్గాల ద్వారా అందుతున్న రాబడిని ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ద్వారా విడుదల అయిన నిధులు, వాటి వెచ్చింపు వివరాలను గుణాంకల ద్వారా తెలిపారు. ఈ సందర్భంగా సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ గ్రామ స్వరాజ్యమే దేశ స్వరాజ్యమని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం మొట్ట మొదటగా రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక సంస్థలు స్వయం పాలన సంస్థలు అని, స్థానిక సంస్థలు పరిపుష్టం చెంది ప్రజలకు సమర్థవంతంగా వసతులు, సేవలు కల్పించాలన్నారు. అందుకు స్థానిక సంస్థల అధికారులు అంకిత భావంతో సేవలు అందించాలని కోరారు. ఘన, ద్రవ వ్యర్థ పదార్థాల నిర్వహణ పద్ధతులు అవలంబించి మహబూబ్‌నగర్ కార్పొరేషన్‌ను ఆదర్శంగా రూపొందాలని సూచించారు. ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణలో మధ్యప్రదేశ్ ఇండోర్‌లో అవలంబిస్తున్న ఉత్తమ పద్ధతులను ఫైనాన్స్ కమిషన్ అధ్యయనం చేస్తుందని తెలిపారు. గ్రామ పంచాయతీలు తడి, పొడి చెత్త ద్వారా వర్మికంపోస్ట్ తయారు చేసి మహిళ సంఘాల ద్వారా విక్రయించ వచ్చని, తద్వారా ఆదాయంతో పాటు, భూసారం తగ్గుతుందన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి



మాట్లాడుతున్న ఎంఎల్‌సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి

పనులు పూర్తి చేస్తేనే గ్రామాల అభివృద్ధి

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జిల్లెల చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రాధాన్యత ప్రకారం నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ గత 10 సంవత్సరాల్లో కొత్త మండలాలు, గ్రామాలు ఏర్పాటు అయ్యాయన్నారు. చాలాచోట్ల భవనాలు, సిబ్బంది లేరని చెప్పారు. సీనరేజ్, స్టాంపు డ్యూటీ దాయం రాష్ట్ర ప్రభుత్వానికి పోతున్నట్లు స్థానిక సంస్థలకు రావటం లేదని అన్నారు. గ్రామ పంచాయతీలకు నిధులు రావాలన్నారు. రాష్ట్ర ఆర్థిక సంఘం కమిషన్ సభ్యులు సంకిపల్లి సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ 500 జనాభా ఉన్న తండాలను జీపీలుగా గత ప్రభుత్వం చేసిందని, ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని చెప్పారు. సమావేశంలో కమిషన్ సభ్యులు ఎం.రమేష్, రమేష్, కాత్యాయని, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్(మహబూబ్‌నగర్), దేవ సహాయం(నాగర్‌కర్నూల్), యాదయ్య(వనపర్తి), నర్సింగ్‌రావు(గద్వాల), ఉమ్మడి జిల్లాల జడ్పీ సీఈఓలు, డివిజనల్ పంచాయతీ అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మునిసిపల్ రిసోర్స్ పార్కు సందర్శన



కోయిలకొండ ఎక్స్‌రోడ్డులో గల మున్సిపల్ రిసోర్స్ పార్క్‌ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ పరిధిలోని కోయిలకొండ ఎక్స్‌రోడ్డులో గల మునిసిపల్ రిసోర్స్ పార్క్‌ను ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, సభ్యులు సందర్శించారు. అక్కడ తడి, పొడి చెత్త వేరు చేయడం, దాని ద్వారా వర్మీ కంపోస్ట్ తయారీ, బయో మైనింగ్ ద్వారా కంపోస్ట్ తయారీని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వివరించారు. వారి వెంట కలెక్టర్ విజయేందిరబోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, మునిసిపల్ పారిశుధ్య విభాగం అధికారులు ఉన్నారు.

తహసీల్దార్ తీరుపై విమర్శలు

- కార్యాలయం వద్ద ఓ రైతు ఆత్మహత్యాయత్నం
- పట్టించుకోకుండా వ్యవహరించిన అధికారి
- సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ అవుతున్న వీడియో

హైదరాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆయన పేరు యు.పులిరాజు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలానికి తహసీల్దార్. ఓ సంఘటన విషయంలో ఆయన వ్యవహరించిన తీరు విమర్శలకు దారితీసింది. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో ట్రోల్ అవుతోంది. వివరాలిలా ఉన్నాయి. మిడ్జిల్ మండలంలోని వాడ్యాల్ గ్రామానికి చెందిన గజ్జల కృష్ణయ్య అనే రైతు, సర్వే నంబరు 156లో 0.3 గుంటల భూమికి పట్టాదార్‌పాస్ పుస్తకం కావాలని 15 సంవత్సరాలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ నేపథ్యంలో కృష్ణయ్య సోమవారం రెవెన్యూ కార్యాలయానికి వచ్చి, వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగేందుకు యత్నించారు. ఆ సమయంలో తహసీల్దార్ పులిరాజు తనకేమీ సంబంధం లేదన్నట్లు ఫోన్‌లో మాట్లాడుతుండటం విమర్శలకు దారితీసింది. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యింది. మానవత్వం లేని తహసీల్దార్ అని, ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటుంటే పట్టించుకోకుండా ఫోన్‌లో మాట్లాడుతున్నాడని నెటిజనం ట్రోల్ చేస్తున్నారు. ఈ సంఘటనపై తహసీల్దార్ పులిరాజును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, తనకు వైకల్యం ఉన్నందున కుర్చీలో నుంచి లేవలేదని తెలిపారు. ఎస్ఐకి ఫోన్ చేసి విషయాన్ని చెప్పినట్లు తెలిపారు. గజ్జల కృష్ణయ్య ఆత్మహత్యాయత్నాన్ని కార్యాలయ సిబ్బంది అడ్డుకున్నారని చెప్పారు. జరిగిన సంఘటనకు చింతిస్తూ బాధితుడు సంజాయిషీ లేఖ కూడా ఇచ్చాడని వివరించారు. అన్నాదమ్ముల మధ్య భాగస్వామ్య వివాదంలో తాము చేయగలిగేది ఏమీ లేదన్నారు. కోర్టు నుంచి న్యాయం పొందాలని చెప్పినా వినకుండా కృష్ణయ్య రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు.

త్రీడీ క్రాఫ్ట్స్‌లో బిజ్వార్ విద్యార్థిని ప్రతిభ

- జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి
- రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



బిజ్వార్ పాఠశాలలో విద్యార్థులకు అభినందనలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఊట్కూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని బిజ్వార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి టి.నాగమణి త్రీడీ క్రాఫ్ట్‌లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యింది. జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన కళాఉత్సవ్‌లో విద్యార్థిని నాగమణి రూపొందించిన త్రీడీ చిత్రానికి జిల్లా స్థాయి ప్రథమ బహుమతి సాధించి, రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం కిశోర్‌కుమార్, ఉపాధ్యాయుడు మనోహర్‌లు ఆమెతో పాటు, పోటీలో పాల్గొన్న ఇతర విద్యార్థులను సన్మానించారు. వారిని ప్రోత్సహించిన ఆర్ట్ టీచర్ హర్షద్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేశ్, మహేష్, నాగరాజ్, గజలప్ప, హర్షద్, చంద్రశేఖర్, నరేశ్, శేఖర్, యాసిన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం ప్రాజెక్టుకు మరింత పడిపోయిన ఇన్‌ఫ్లో

గద్వాల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వర్షాలు తగ్గిపోవడంతో కృష్ణ, తుంగభద్ర నదులకు వరద తగ్గిపోయింది. శ్రీశైలం ప్రాజెక్టుకు మరింత ఇన్‌ఫ్లో తగ్గింది బుధవారం 62,430 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నది. ప్రాజెక్టు గేట్లను మూసివేసి కుడి, ఎడమ విద్యుత్ కేంద్రాల ద్వారా 66,059 క్యూసెక్కులను నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 205.22 టీఎంసీలు నిల్వ ఉన్నది. ఆల్మట్టి ప్రాజెక్టుకు 20 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లు మూసివేశారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 20 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు 19 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లను మూసివేశారు. గేట్లు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 14 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉన్నది. భీమా నది నుంచి సన్నతి బ్యారేజీ అవుట్‌ఫ్లో 20 వేల క్యూసెక్కులు జూరాలకు వస్తోంది. ప్రస్తుతం జూరాలకు 39 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా గేట్లను మూసివేశారు. విద్యుత్ ఉత్పత్తి ద్వారా 32,917 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు నుంచి సుంకేసులకు 30 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా అందులో 27 వేల క్యూసెక్కులను శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

బిజినేపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీ కోసం నిర్వహించనున్న ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.భాస్కర్‌కుమార్ బుధవారం ఒ క ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా, బిజినేపల్లి మండలంలోని వట్టెం జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈ నెల 23లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు 2009, జూన్ 1 నుంచి 2011, జూలై 31 మధ్య జన్మించి ఉండాలని పేర్కొన్నారు. వచ్చే సెంవత్సరం ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు.

పార్టీ బలోపేతమే లక్ష్యం

- బీసీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతకుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బండారి శాంతకుమార్

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించినందున, పాలమూరు జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారి శాంతకుమార్ అన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యాయుడిగా నియమితుడైన తర్వాత బుధవారం మొదటిసారి ఆయన మహబూబ్‌నగర్ పట్టణానికి వచ్చారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. తెలంగాణ చౌరస్తాలో క్రేన్‌తో భారీ గజమాల వేసి సన్మానించారు. అనంతరం ర్యాలీగా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి మోదీ సుపరిపాలనను దేశ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలపై చిత్తశుద్ధి లేదని, సంవత్సరన్నర కాలయాపన చేసి అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ తీర్మానాన్ని పాస్ చేశారన్నారు. అవినీతిలో కూరుకుపోయిన బీఆర్ఎస్ పరిస్థితి ఇప్పుడు ఏమైందో ప్రజలు చూస్తున్నారని, ఆ పార్టీ ఇక కనుమరుగు కానుందన్నారు. బీజేపీకి ప్రత్యర్థి కాంగ్రెస్ అని, ఆ పార్టీ వైఫల్యాలను ఎక్కడికక్కడ ఎండగట్టాల్సిన అవసరం ఉందని నాయకులు, కార్యకర్తలకు సూచించారు.

బోగస్ మాటలతో కాలం వెళ్లదీస్తారా?

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి

నర్వ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సన్నరకం ధాన్యం పండించే రైతులకు రూ.500 బోనస్ ఇస్తారా? బోగస్ మాటలతో కాలం వెళ్లదీస్తారా అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జీఎస్టీపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. మహబూబ్‌నగర్, కృష్ణ రైల్వే స్టాపుల ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లా, నర్వ మండల కేంద్రంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నర్వ మండలంలోని రైతులకు 2 వేల మెట్రిక్ టన్ను యూరియా సరిపోయేదని, అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటికే 4 వేల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించినా కొరత ఎందుకు ఏర్పడిందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు అజిత్‌సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ పసుల నీరజ్, మాజీ సర్పంచ్‌లు సంధ్య ఆంజనేయులు, వెంకటేశ్వర్‌రావు, నాయకులు మంగ లావణ్య, మల్‌రెడ్డి, సురేందర్, గంగాధర్, చిత్తనూరు భాస్కర్‌రెడ్డి, ఉందెకోడ్ రాజేందర్‌కుమార్, విజయ్‌రామ్, నాగన్నగారి యాదవరెడ్డి, రాంపూర్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుల ఆర్థిక సాయం



వెన్నచెర్లలో తోటి స్నేహితురాలికి ఆర్థిక సాయం చేస్తున్న స్నేహితులు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెన్నచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1988-89ఎస్ఎస్‌సీ బ్యాచ్‌కు చెందిన నాటి విద్యార్థినీ కే.జయమ్మకు తోటి స్నేహితులు బుధవారం ఆర్థిక సాయం చేశారు. విద్యార్థులు తోటి స్నేహితురాలు కే.జయమ్మ భర్త చంద్రశేఖర్‌గౌడ్‌కు గుండెకు చికిత్స చేసిన విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు అందరు కలిసి ఆయన ఆసుపత్రి ఖర్చులకు గాను రూ. 26,500లను తోటి స్నేహితులు డాక్టర్ జే.కురుమూర్తి, కొత్త రవీందర్‌రెడ్డిలు కలిసి ఆమెకు అందజేశారు. ఆర్థిక సహాయం చేసిన ప్రతీ ఒక్కరికి జయమ్మ కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య


కరీం (ఫైల్)

ఆత్మకూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులను భరించలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన వనపర్తి జిల్లా, ఆత్మకూరు పట్టణంలోని గార్లగుట్ట కాలనీలో జరిగింది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన షేక్ నైమా సుల్తానా భర్త గతంలో మృతి చెందాడు. ఆమెకు ఇద్దరు కుమారులున్నారు. చిన్న కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నాడు. పెద్దకుమారుడు షేక్ కరీం(21)తో కలిసి ఆత్మకూరులో నివసిస్తున్నారు. ఇటీవల కొంతకాలంగా వారు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం నైమా సుల్తానా వనపర్తిలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న కరీం వంట గదిలోని రేకుల పైకప్పునకు ఉన్న ఇనుప కడ్డీకి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం ఉదయం చుట్టుపక్కల వారు గమనించి తల్లికి, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనపై తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీరన్నపల్లిలో మరో వ్యక్తి..

బాలానగర్ (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండలంలోని వీరన్నపల్లిలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ లెనిన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తెలుగు ఎల్లయ్య (57) భార్య నాలుగేళ్ల క్రితం మృతి చెందింది. ఈ నేపథ్యంలో ఎల్లయ్య మంగళవారం పొలంలో పురుగుల మందు తాగాడు. చుట్టుపక్కల రైతులు గమనించి ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది. కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


సంగనమోని రాములు (ఫైల్)

పాన్‌గల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో ఓ రైతు మృతి చెందాడు. వనపర్తి జిల్లా, పాన్‌గల్ మండలంలో ఈ సంఘటన జరిగింది. హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మదాపూర్ గ్రామానికి చెందిన రైతు సంగనమోని రాములు (53) భీమా కాలువలోని మోటారుకు అడ్డుగా ఉన్న నాచును తొలగించేందుకు నీటిలో దిగాడు. నాచును తొలగిస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. సంఘటనపై అతడి భార్య బుచ్చమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. రాములుకు కుమారుడు, కూతురు ఉన్నారు.

విద్యార్థి మృతదేహం లభ్యం


చంద్రశేఖర్ (ఫైల్)

గద్వాల, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిలో గల్లంతైన విద్యార్థి చంద్రశేఖర్ మృతదేహం బుధవారం లభ్యమైంది. జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండలంలోని రేకులపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్ (13), స్నేహితుడు కృష్ణతో కలిసి గత శనివారం కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లారు. పుట్టీ కొట్టుకుపోయి బోల్తాపడటంతో కృష్ణ ఈత కొట్టుకు చేరుకున్నాడు. చంద్రశేఖర్ గల్లంతయ్యాడు. అతడి మృతదేహం బుధవారం కొత్తపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ సమీపంలో నదిలో కొట్టుకుపోతుండగా జాలరులు గుర్తించి ఒడ్డుకు చేర్చారు. సమాచారం అందుకున్న గద్వాల రూరల్ ఎస్‌ఐ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం తర్వాత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పాఠశాల బస్సులో డీజిల్ చోరీ

మహమ్మదాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఓ ప్రైవేట్ పాఠశాల బస్సులో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్‌ను చోరీ చేశారు. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా, మహమ్మదాబాద్ మండల కేంద్రంలో జరిగింది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం డ్యూటీ అయిపోయిన తరువాత డ్రైవర్ దానిని స్థానిక రాజేంద్రగర్‌కాలనీలోని ఖాళీ స్థలంలో నిలుపుతాడు. ఈ విషయాన్ని గమనించిన కొందరు దుండగులు సోమవారం రాత్రి బస్సు డీజిల్ ట్యాంకు తాళాన్ని పగులగొట్టి, అందులోని 100 లీటర్ల డీజిల్‌ను ఎత్తుకెళ్లారు. అలాగే ఎల్లమ్మ దేవాలయం సమీపంలో నిలిపిన మరో బస్సులోనూ డీజిల్ చోరీకి యత్నించారు. కానీ తాళం విరగకపోవడంతో వదిలేసి వెళ్లిపోయారు. ఈ సంఘటనపై డ్రైవర్ బాలరాజు బుధవారం మహమ్మదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా

చారకొండ/ కల్వకుర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు. చారకొండ, కల్వకుర్తి ఎస్‌ఐలు శంషుద్దీన్, మాధవరెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చారకొండ, కల్వకుర్తిలలో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో నల్గొండ జిల్లా, దేవరకొండ మండలంలోని కొండభీమనపల్లి గ్రామానికి చెందిన జయకృష్ణ, కల్వకుర్తి పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీకి చెందిన హనుమంతు పట్టుబడ్డారు. వారిద్దరినీ పోలీసులు బుధవారం కల్వకుర్తి కోర్టులో హాజరు పరిచారు. జయకృష్ణకు 2 రోజులు, హనుమంతుకు 3 రోజుల జైలు శిక్ష, రూ.100 జరిమానా విధిస్తూ న్యాయాధికారి కావ్య తీర్పు వెల్లడించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

» 9 మంది అరెస్టు, రూ.1.44 లక్షలు స్వాధీనం

కల్వకుర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. సంఘటనకు సంబంధించి కల్వకుర్తి-2 ఎస్‌ఐ రాజశేఖర్ కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణ సమీపంలోని యాదాద్రి హోంలో కొందరు పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో బుధవారం తెల్లవారుజామున దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.1,44,458తో పాటు, 9 మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

ప్రేమ పేరుతో యువకుడి వంచన

» పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు

పెబ్బేరు, సెప్టెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ప్రేమ, పెళ్లి పేరుతో బాలికను మోసం చేసిన యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. వనపర్తి జిల్లా, పెబ్బేరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17)ను మరో గ్రామానికి చెందిన యువకుడు ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తీరా ఆమె గర్భవతి అయిన తర్వాత వివాహానికి అంగీకరించలేదు. దీంతో ఆ బాలిక కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలపడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఊర్కొండ మండలంలో మరో కేసు...

ఊర్కొండ, (ఆంధ్రజ్యోతి) : బాలికను వేధిస్తున్న యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా, ఊర్కొండ మండలంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపిన వివరాల ప్రకారం ఇప్పపహాడ్ గ్రామానికి చెందిన శివప్రసాద్ (19) అనే యువకుడు, మరో గ్రామానికి చెందిన బాలిక (17)కు నిత్యం ఫోన్ చేసి వేధిస్తున్నాడు. విసిగిపోయిన బాలిక ఈ విషయాన్ని తన తల్లి దండ్రులకు తెలిపింది. దీంతో బుధవారం బాలిక కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.


అమరచింతలో టోకెన్ల కోసం వేచి ఉన్న రైతులు


హన్వాడ పీఏసీఎస్ వద్ద యూరియా కోసం క్యూలైన్లలో వేచి ఉన్న రైతులు

యూరియా కోసం.. రోడ్డెక్కిన రైతన్న


పాన్‌గల్‌లో రాస్తారోకో చేస్తున్న రైతులకు మద్దతు ప్రకటిస్తున్న సీపీఎం నాయకులు

» పలు చోట్ల రాస్తారోకోలు, ధర్నాలు

ఆత్మకూరు/ పాన్‌గల్/ దేవరకద్ర/ హన్వాడ/ అమరచింత/ మూసాపేట/ సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : యూరియా కోసం ఎదురుచూపులతో విసిగిపోయిన రైతులు ఆందోళన బాటపడుతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బుధవారం పలు చోట్ల రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టారు. వివిధ పార్టీల నాయకులు వారికి మద్దతు తెలిపారు.

● వనపర్తి జిల్లా, ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఐ ఆధ్వర్యంలో రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి లక్ష్మీనారాయణశెట్టి మాట్లాడుతూ సాగుకు సరిపడా యూరియాను రైతులకు అందించాలని, లేకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ చాంద్‌పాషాకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీహరి, మోషా, బాలరాజు, ఆంజనేయులు, రాములు, రవి, లింగన్న పాల్గొన్నారు.

● పాన్‌గల్ మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో రైతులు రాస్తారోకో చేపట్టారు. వారికి సీపీఎం నాయకులు మద్దతు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. అధికారులు వచ్చి హామీ ఇస్తేనే రాస్తారోకో విరమిస్తామని వారు స్పష్టం చేశారు. దీంతో సింగిల్ విండో సీఈవో భాస్కర్ గౌడ్ వచ్చి రైతులతో మాట్లాడారు. రెండు లారీల యూరియా వస్తుందని, వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని చెప్పారు. రెండు రోజుల క్రితం టోకెన్లు ఇచ్చిన రైతులకు యూరియా ఇస్తామని, మిగిలిన వారికి తర్వాత పంపిణీ చేస్తామని చెప్పారు. వారి నుంచి ఆధార్‌కార్డులు, పట్టాదారు పాసుబుక్కుల జిరాక్స్ కాపీలు తీసుకున్నారు. ధర్నాలో సీపీఎం మండల కార్యదర్శి బాల్యానాయక్, సీఐటీయూ నాయకుడు సూర్యవంశం రాము పాల్గొన్నారు.

● అమరచింత రైతు ఆగ్రో సేవా కేంద్రానికి అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. దీంతో ఎస్‌ఐ స్వాతి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. రైతులను వరుసక్రమంలో నిలబెట్టి టోకెన్లు పంపిణీ చేయించారు. టోకెన్లు అందని రైతులు నిరాశగా వెనుదిరిగి వెళ్లిపోయారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద అంతర్రాష్ట్ర రహదారిపై రైతులు రాస్తారోకో చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నాగన్న అక్కడికి చేరుకొని వారికి నచ్చచెప్పారు. అందరికీ టోకెన్లు ఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

● హన్వాడ మండల కేంద్రంలోని పీఏసీఎస్ కేంద్రానికి బుధవారం యూరియా కోసం రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. 1,200 బస్తాల యూరియా రావడంతో ఒక్కొక్కరికి రెండు బస్తాల యూరియా పంపిణీ చేశారు. మిగిలిన వారికి రెండు రోజుల తర్వాత ఇస్తామని అధికారులు తెలిపారు.

● మూసాపేట మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణం వద్దకు యూరియా కోసం అధిక సంఖ్యలో రైతులు తరలివచ్చారు. వ్యవసాయాధికారి అనిల్‌కుమార్ వారికి టోకెన్లు ఇచ్చి, యూరియా పంపిణీ చేయించారు.

వర్షంలోనూ తప్పని కష్టం

ఆత్మకూరు : యూరియా టోకెన్ల కోసం రైతులు వర్షంలో తడుస్తూ ఎదురు చూడాల్సి వచ్చింది. వనపర్తి జిల్లా, ఆత్మకూరు సహకార సంఘం కార్యాలయం వద్దకు బుధవారం ఉదయమే రైతులు అధిక సంఖ్యలో చేరుకున్నారు. మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. అయినా రైతులు వానలో తడుస్తూనే వేచి ఉన్నారు. సాయంత్రం 5 గంటలకు 600 బస్తాల యూరియా రావడంతో ఒక్కొక్కరికి 2 బస్తాల చొప్పున పంపిణీ చేశారు. వారిని వరుసక్రమంలో నిలబెట్టేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది.


ఆత్మకూరు పీఏసీఎస్ ముందు భోజనం చేస్తున్న రైతులు

జాతీయ స్థాయికి ఎదగాలి

» బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మక్బూద్‌బిన్ జాకేర్


రాష్ట్ర స్థాయి జట్ల ఎంపిక పోటీలకు హాజరైన జిల్లా క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) :పాలమూరు జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలని బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మక్బూద్ బిన్ జాకేర్ అన్నారు. హైదరాబాద్‌లో ఈ నెల 12 నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఆ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులను బుధవారం జిల్లా కేంద్రంలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జాకేర్ మాట్లాడుతూ తెలంగాణ సబ్ జూనియర్ బాల, బాలికల ఓపెన్ సెలక్షన్లను హైదరాబాద్ నిర్వహిస్తారని తెలిపారు. అందుకోసం ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహరాడూన్‌లో వచ్చే నెల 4 నుంచి 10వ తేదీ వరకు 50వ సబ్ జూనియర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నసురుల్లాహైదర్, ఉపాధ్యక్షుడు సుభాహన్‌జీ, ప్రతినిధులు ఇలియాజ్, మీర్‌ఖలీల్‌అలీ, షకీల్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు

» డీవైఎస్‌వో జితేందర్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో జితేందర్

గద్వాల అర్బన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీవైఎస్‌వో జితేందర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో బుధవారం నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి చూపాలన్నారు. గద్వాల మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 600 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. పోటీల్లో ప్రతిభ కనబరచిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ మండల కన్వీనర్ హైమావతి తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రేణుకాదేవి, జహీరుద్దీన్, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణయ్య, బీసన్న, రజనీకాంత్, స్రవంతి, రాములమ్మ, స్వప్న, మల్లేశ్వరి, రాధ, అనూష, రాజేందర్ పాల్గొన్నారు.

నడిగడ్డ యువత అన్ని రంగాల్లో రాణించాలి

» గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

» 'ఏ కన్ను చూడదనా' షార్ట్ ఫిలిం షూటింగ్ ప్రారంభం


క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

గద్వాల టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నడిగడ్డకు చెందిన యువత అన్ని రంగాల్లో రాణించాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ఆకాంక్షించారు. జిల్లాకు చెందిన అభి సుబ్రమణ్యం నిర్మాత, హీరోగా, కార్తీక్ క్రియేటివ్ ఫ్రేమ్స్ ఆధ్వర్యంలో, రూపుదిద్దుకుంటున్న 'ఏ కన్ను చూడదనా' షార్ట్ ఫిలిం షూటింగ్‌ను గద్వాల పట్టణంలోని నదీ అగ్రహారం వద్ద ఆయన క్లాప్ కొట్టి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా, ధర్మనిష్ఠ గొప్పతనాన్ని ప్రతిబింబించేలా చిత్రాన్ని రూపొందిస్తుండటం హర్షదాయకమన్నారు. షార్ట్ ఫిలిం హీరోయిన్‌గా నీలిమ పతకం శెట్టి నటిస్తున్నారు. శ్రీకృష్ణ గోర్లే దర్శకత్వం వహిస్తున్నారు. కార్యక్రమంలో యూనిట్ మేనేజర్ ప్రశాంత్, పలువురు నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

14న ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక


మాట్లాడుతున్న షూటింగ్‌బాల్ జిల్లా అధ్యక్షుడు సత్య అంజనేయులు

మక్తల్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న ఉమ్మడి జిల్లా షూటింగ్‌బాల్ జట్టు ఎంపికలు నిర్వహించనున్నామని షూటింగ్‌బాల్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.గోపాలం, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు సత్య అంజనేయులు తెలిపారు. పట్టణంలోని మినీ స్టేడియంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. నారాయణపేట జిల్లా షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా (నారాయణపేట, వనపర్తి, మహబూబ్‌నగర్) జూనియర్ షూటింగ్ బాల బాలికల జట్ల ఎంపికలను ఈ నెల 14న మక్తల్‌లో నిర్వహించనున్నామని తెలిపారు. పోటీల్లో ప్రతిభ చాటిన బాల, బాలికలను 21 నుంచి 24 వరకు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్‌కార్డు, క్రీడా దుస్తులు, రెండు ఫొటోలతో హాజరు కావాలని కోరారు. సమావేశంలో రమేశ్‌కుమార్ ఉన్నారు.

ప్రజల గుండె చప్పుడు భారత రాజ్యాంగం

» కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు


చాకలి ఐలమ్మ చిత్ర పటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

కల్వకుర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం ప్రజల గుండె చప్పుడని, దానిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. 'రాజ్యాంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అంశంపై కేవీపీఎస్ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా, కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ ఆ ఫలాలు సంపన్నులకే దక్కుతున్నాయని, సామాన్యులకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో 200 మంది కోటీశ్వరుల ఆస్తులు 40 శాతం ప్రజల ఆస్తులతో సమానంగా ఉన్నాయని తెలిపారు. రాజ్యాంగాన్ని వ్యతిరేకించిన వారే నేడు కేంద్రంలో అధికారంలో ఉన్నారని ఆరోపించారు. బీహార్‌లో 65 లక్షల మందిని ఓటుకు అనర్హులుగా చేసిన ఘనత బీజేపీకే దక్కిందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఏకతాటిపై నిలిచి రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సదస్సులో ప్రిన్సిపాల్ శర్వాణీ, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులిజాల పరశురాములు, నాయకులు ఏపీ మల్లయ్య, కాశన్న, హనుమంతు, చెన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ చంద్ర శేఖర్, హెచ్‌డబ్ల్యూవో ఖలీల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు

పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ

తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. కల్వకుర్తి పట్టణంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు.

కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్లు ఎడ్మ సత్యం, రాచోటి శ్రీశైలం, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, నాయకులు శ్రీనివాసులు, దుర్గాప్రసాద్, రాజేందర్, బాలయ్య, గోపాల్, గణేశ్, భగత్‌సింగ్, పరశురాములు, ఏపీ మల్లయ్య, బాల్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

కొల్లాపూర్ నల్లమలపై 100 సీసీ కెమెరాలతో నిఘా

- ఎండీ ముజీబ్ ఘోరి, ఫారెస్టు సెక్షన్ అధికారి



కొల్లాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు పరిధిలో ఉన్న కొల్లాపూర్ ఫారెస్టు జోన్ పరిధిలో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నల్లమలపై ప్రత్యేకంగా వేసి ఉంచామని ఫారెస్టు సెక్షన్ అధి కారి ఎండీ ముజీబ్ ఘోరి ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో వెల్లడించారు.

కొల్లాపూర్ నల్లమలలో వన్య ప్రాణుల, మూగజీవాల సంచారం పెరిగిందా?

గడిచిన పదేళ్ల నుంచి అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టులో స్మగ్లర్లు ఎవరూ ప్రవేశించకుండా అటవీ శాఖ ఆధ్వర్యంలో గట్టి నిఘా ఏర్పాటు చేశాం. దీంతో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్టు పరిధిలో ఉన్న కొల్లాపూర్ నల్లమల దట్టంగా పెరిగింది. దీంతో నల్లమలలో పెద్ద పులులు కూడా సంచరిస్తున్నాయి. ఇటీవలే వాటి పాదముద్రలు కూడా గుర్తించాం. చిరుతలు వన్యప్రాణుల మూగజీవాల సంఖ్య విపరీతంగా పెరిగింది.

నల్లమలలో సంచరించేందుకు అనుమతులు అవసరమా ?

అటవీ ప్రాంతంలో సంచరించేందుకు అనుమతులు లేవు. తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే అటవీ శాఖ ఉన్నతాధికారుల అనుమతులు తీసుకొని వెళ్లాలి. వారితో పాటు అటవీ శాఖ సిబ్బంది కూడా ఉంటారు. ఎవరైనా అనుమతులు లేకుండా నల్లమలలో సంచరిస్తే చర్యలు ఉంటాయి.

నల్లమలలో ప్లాస్టిక్ వ్యర్థాలు చల్లితే చర్యలు ఉంటాయా?

ప్లాస్టిక్ రహిత నల్లమలగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నాం. కావాలని నల్లమలలో ప్లాస్టిక్ వ్యర్థాలు వేసినా, చెట్లను నరికినా, వాటికి నిప్పు పెట్టినా అటవీశాఖ ఆధ్వర్యంలో కఠిన చర్యలు తప్పక ఉంటాయి. కేసులు నమోదు చేస్తాం.

మూగజీవాలను మేపు కోసం నల్లమలలోకి తీసుకువెళ్లవచ్చా?

కృష్ణానది పరివాహక ప్రాంతాలైన నల్లమల గ్రామాల రైతులు దట్టమైన అటవీ ప్రాంతంలోకి మూగజీవాలను మేత కోసం తీసుకువెళ్లకూడదు. అడవి కింది భాగంలోనే మేత కోసం మూగజీవాలను తీసుకువెళ్లవచ్చు. నల్లమల దట్టంగా ఏపుగా ఉండడంతో అడవిలో సంచరించే జీవాల నుంచి గొర్రెలు, మేకలకు ప్రాణహాని కలగవచ్చు అందుకే రైతులకు జాగ్రత్తలు సూచిస్తున్నాం.

న్యూస్ బాక్స్

రైతులు యూరియా కోసం ఆందోళన చెందొద్దు

- పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్

చారకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు యూరియాపై ఎలాంటి ఆందోళన చెందవద్దని పీఏసీఎస్ చైర్మన్ జెల్ల గురువయ్యగౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతేడాది కంటే ఈసారి మండలంలో రైతులు పంట సాగు ఎక్కువగా చేశారని అన్నారు. గతేడాది 4,650 బస్తాలు (209 మెట్రిక్) టన్నుల యూరియా వస్తే, ఈ ఏడాది సెప్టెంబరు మొదటి వారం వరకు 6,255 బస్తాలు (281 మెట్రిక్) టన్నుల యూరియా వచ్చిందని అన్నారు. నానో యూరియా వాడితే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవో భూత్పూరు వెంకటయ్య, సిబ్బంది భీమయ్యగౌడ్ పాల్గొన్నారు.

మూడు రోజులపాటు మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిపివేత

చారకొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తిలో మిషన్ భగీరథ పైపులైన్ల మరమ్మతుల కారణంగా చారకొండ మండలంలో మూడు రోజులు 11, 12, 13వ తేదీ వరకు మిషన్‌భగీరథ నీటి సరఫరాను నిలిపి వేస్తున్నట్లు మిషన్ భగీరథ ఏఈ రితీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

నేడు జప్తి సదగోడులో టీబీ వైద్య శిబిరం

ఉప్పునుంతల, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జప్తిసదగోడ గ్రామంలోని పల్లె దవాఖానలో గురువారం టీబీ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి స్వప్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్యులు టీబీ పరీక్షలు నిర్వహిస్తారని వారు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

పండ్ల తోటల కోసం దరఖాస్తు చేసుకోవాలి

తిమ్మాజిపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ వ్యవసాయ పొలాల్లో పండ్ల తోటలు పెంచుకోవడానికి ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరు కోసం దరఖాస్తు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి హేమలత అన్నారు. గుమ్మకొండలో ఆమె బుధవారం మాట్లాడుతూ రైతులు తోటలు పెంచుకోవడమే కాకుండా, తమ వ్యవసాయ పొలాల గట్ల వెంట టేకు చెట్లు, ఈత కొబ్బరి వంటికి పెంచుకోవడానికి అవకాశం ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించే వరకు పోరాటం ఆగదు'

కల్వకుర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీసీ రిజర్వేషన్ బిల్లును కేంద్రం ఆమోదించే వరకు పోరాటం ఆగదని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీలపై కేంద్రానికి ఏ మాత్రం ప్రేమ ఉన్నా 42శాతం రిజర్వేషన్లను అమలుపర్చాలని ఆయన కోరారు.

మహిళా శక్తికి ప్రతీక

- చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి

- జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, ఇన్‌చార్జి బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదగిరి



నాగర్‌కర్నూల్‌లో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారులు

నాగర్‌కర్నూల్‌టౌన్/ అచ్చంపేటటౌన్/ కల్వకుర్తి/ కొల్లాపూర్/ బిజినేపల్లి/ ఉప్పునుంతల/ చారకొండ/ తాడూరు/ లింగాల/ పెద్దకొత్తపల్లి/ తెలకపల్లి/వంగూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో సాహసంతో పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ నేటి మహిళా శక్తికి ప్రతీకగా నిలిచిందని జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా బీసీ సంక్షేమశాఖ ఇన్‌చార్జి అధికారి యాదగిరి అన్నారు. బుధవారం జిల్లా బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని హౌసింగ్‌బోర్డు కాలనీ బస్టాపు వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి అధికారి యాదగిరి చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అధికారులు, ప్రజా, సామాజిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

● జిల్లాలో పలు పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని హౌసింగ్ బోర్డు బస్టాప్ వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అచ్చంపేటలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ ఆధ్వర్యంలో, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మనోహర్ ఆధ్వర్యంలో వేర్వేరుగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. కల్వకుర్తి మండలం జిల్లెల గ్రామంలో మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య, రజక సంఘం అధ్యక్షుడు రవి ఆధ్వర్యంలో ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ● కొల్లాపూర్‌లో కాంగ్రెస్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు జూపల్లి అరుణ్ చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలోని అన్ని మండలాల్లో చాకలి ఐలమ్మ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి, ఘన నివాళి అర్పించారు.



నాగర్‌కర్నూల్‌లో చాకలి ఐలమ్మ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు



కొల్లాపూర్‌లో జూపల్లి అరుణ్, రజక సంఘం నాయకుల నివాళి



అచ్చంపేటలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కల్వకుర్తి : చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు

అనారోగ్యంతో ఎవరూ బాధపడొద్దు

- వైద్య శిబిరంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : నల్లమలలో ఎవరూ అనార్యోగంతో బాధపడవద్దు, ప్రతీ ఒక్కరికి ఉచిత కార్పొరేట్ వైద్యం అందిస్తామని ఎమ్మెల్యేడాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. 3వ మెగా సర్జికల్ క్యాంపులో భాగంగా మిగిలిన వారికి బుధవారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సర్జరీలు చేశారు. డీసీహెచ్ డాక్టర్ రామ కృష్ణ, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభు, వైద్యులు శ్రీనివాసులు, మహేష్, బిక్కులాల్, బాల్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

● అచ్చంపేట : సీజనల్ వ్యాధుల ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీవో మధుసూదన్ గౌడ్‌తో కలిసి మాట్లాడారు.

కాంగ్రెస్‌లో చేరిక

అచ్చంపేటరూరల్ : అచ్చంపేట మండల కిష్టతండా, బాల్యతండాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కా ర్యకర్తలు సుమారు 50 మంది స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ స మక్షంలో కాంగ్రెస్ పార్టీలో చే రారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

● పదర : మండలంలోని కండ్లకుంట్ల గ్రామానికి చెందిన పది కుటుంబాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు.



ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో వారంతా ఎమ్మెల్యే వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఏఆర్ యాదవ్, సింగిల్ విండో చైర్మన్ పోషం గణేష్, మాజీ సర్పంచ్ ప్రేమ్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు షర్ఫుద్దీన్, సింగిల్‌విండో డైరెక్టర్ రమేష్ యాదవ్, నాయకులు పెద్దిరాజు యాదవ్, పవన్ కుమార్ ఉన్నారు.

శాంతికుమార్‌ను సన్మానించిన బీజేపీ నాయకులు

ఊర్కొండ, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన శాంతికుమార్‌ను ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్ మహబూబ్‌నగర్‌లో పూల మాల శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు తాడెం చిన్నా, దివాకర్‌గౌడ్, అరవింద్ గౌడ్, రాజశేఖర్, తిరుపతిరెడ్డి, రాజ్‌నారాయణ రెడ్డి, మహేందర్, వెంకటేష్, శ్రీనుసాగర్, శివకుమార్, హరీష్ ఉన్నారు.



బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాంతికుమార్‌ను శాలువాతో సన్మానిస్తున్న ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిరంజన్‌గౌడ్

రక్తదానం చేసి మహిళ ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్

బిజినేపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళకు ఓ కానిస్టేబుల్ రక్తం ఇచ్చి ప్రాణాలు కాపాడారు. నాగర్‌కర్నూల్ మండలం చెర్లతిర్మలాపూర్ గ్రామానికి చెందిన యాదమ్మ రోడ్డు ప్రమాదానికి గురై జిల్లా కేంద్రంలోని ప్ర భుత్వ ఆస్పత్రిలో చేరింది. ఆమెకు రక్తం తక్కువగా ఉండి ఆపరే షన్ చేయకపోతే ప్రాణాపాయం ఉందన్న రోడ్డు సేఫ్టీ సంస్థ సభ్యుల సమాచారం మేరకు బిజినేపల్లి పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న జితేందర్ నాయక్ స్పందించారు. ఆయన ఆస్పత్రికి వెళ్లి ఆమెకు అవసరమైన రక్తం ఇచ్చి ఆమె ప్రాణాలు కాపాడారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన మరోదాత తిప్పరి గోపాల్‌లకు బాధిత మహిళ భర్త విష్ణు, రోడ్డు సేఫ్టీ సంస్థ అధ్యక్షుడు ఎద్దుల వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు.



జిల్లా ఆసుపత్రిలో రక్తదానం చేస్తున్న పోలీసు కానిస్టేబుల్ జితేందర్ నాయక్

సేవానిరతికి నిదర్శనం మహమ్మద్ ప్రవక్త

- అల్విజాన్ కమిటీ ఆధ్వర్యంలో మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు వేడుకలు

కల్వకుర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఐకమత్యం సేవానిరతికి మహమ్మద్ ప్రవక్త నిదర్శనమని కల్వకుర్తి సీఐ బి.నాగార్జున అన్నారు. బుధవారం మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజు వేడుకలను కల్వకుర్తి పట్టణంలోని అల్విజాన్ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అల్విజాన్ మసీద్‌లో ముస్లిం యువకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ముస్లింల భక్తిశ్రద్ధలతో భారీ ర్యాలీ కొనసాగింది. ఆవాస్ కమిటీ, లయన్స్‌క్లబ్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని సీఐ, మునిసిపల్ మాజీ చైర్మన్లు రాచోటి శ్రీశైలం, ఎడ్మ సత్యంలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. 5000 మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తాహెర్‌అలీ, అఖిల్ మహమ్మద్, రఫీ, బురాన్, గౌస్‌లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు మాధవరెడ్డి, కృష్ణదేవ, కల్వకుర్తి మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ షాహెద్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు జిల్లెల రాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సయ్యద్‌మసూద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఆవాస్ కమిటీ జిల్లా కన్వీనర్ సలీం, నాయకులు మక్బూల్, ఇంతియాజ్‌ఖాన్, అంజద్‌ఖాన్, ఖాదర్, సుభాని తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

అమ్రాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో బుధవారం మన్ననూర్ పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేశారు. సీజనల్ వ్యాధులు సోకకుండా వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు సూచించారు. హాస్టల్ సంక్షేమ అధికారి సాజిద్‌పాషా ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై గ్రామస్థుల ఫిర్యాదు

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మారేడుమానుదిన్నె ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ జెట్టి నాగరాజు అక్రమాలకు పాల్పడుతున్నారని, ఆయనను విధుల నుంచి తొలగించాలని కోరుతూ పలు గ్రామాల ప్రజలు బుధవారం కలెక్టర్‌కు, డీఆర్‌డీవోలకు ఫిర్యాదు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. మారేడుమానుదిన్నె, చంద్రబండతండా, వేడుకరావుపల్లి తండా గ్రామాల నాయకులు కేతావత్ శంకర్ నాయక్, ముడావత్ బాలునాయక్, పాత్లావత్ మహేష్‌నాయక్, శ్రీహరిరావు, గాడుదుల శంకర్‌యాదవ్, వడ్యా శ్రీనునాయక్ ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

ఆశా వర్కర్ల కమిటీ ఎన్నిక

కొల్లాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్, పెంట్లవెల్లి మండలాల పీహెచ్‌సీ పరిధిలో ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా శివలీల, కార్యదర్శిగా శ్రీదేవి, కోశాధికారిగా గౌరమ్మ, ఉపాధ్యక్షులుగా చెన్నమ్మ, సాజిద, నిర్మల, విజయ కుమారి, సహాయ కార్యదర్శిగా వకలాదేవి, చెన్నమ్మ, రంగమ్మ, సుజాత, రమాదేవి, జ్యోతితోపాటు 28 మందితో కమిటీని ఎన్నుకున్నట్లు సీఐటీయూ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లాఉపాధ్యక్షుడు శివవర్మ, ఆవాజ్ జిల్లా కన్వీనర్ ఎండీ సలీం ఉన్నారు.

ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలి

తిమ్మాజిపేట, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయడం ద్వారానే గుర్తింపు లభిస్తుందని మండల విద్యాశాఖ అధికారి సత్యనారాయణశెట్టి అన్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ ఆవరణలో బుధవారం మండల స్థాయి ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించి, 14మంది ఉపాధ్యాయులను శాలువాలు కప్పి సన్మానించారు. గెజిటెడ్ హెచ్ఎంలు ఉమాపతిరెడ్డి, ప్రేమలత, ఆయా ఉపాధ్యాయ సంఘాల సభ్యులు యాదయ్య, నిరంజన్, పవన్, జయపాల్‌రెడ్డి, నజీర్, కార్తీక్‌కుమార్ పాల్గొన్నారు.



తిమ్మాజిపేటలో సన్మానం పొందిన ఉపాధ్యాయులు

● వంగూరు : వంగూరులోని రైతువేదికలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యుడు కేవీఎన్ రెడ్డితో పాటు వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు యడ్మ మాధవరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కేవీఎన్‌రెడ్డి తన సొంత ఖర్చుతో తెలంగాణ పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు షూను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో మురళీమోహనచారి, మాజీ ఎంపీటీసీ రమేష్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

● అమ్రాబాద్ : మండల పరిధిలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈవో బాలకిషన్ ఆధ్వర్యంలో అమ్రాబాద్‌లో సత్కరించారు. 25మంది ఉపాధ్యాయులను సత్కరించినట్లు తెలిపారు. జీహెచ్ఎంలు, ఎల్ఎఫ్ఎల్ హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- ఎమ్మెల్యే కూచకుళ్ల



దవాఖానాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

తెలకపల్లి, సెప్టెంబరు10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కారువంగలో పల్లె దవాఖానాను ప్రారంభించారు. అనంతరం సీసీరోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందని ఇల్లు లేదంటే అతిశయోక్తి కాదని అన్నారు. ఎన్నికల హామీలలో ఇవ్వని, చెప్పని పథకాలను కూడా అమలు చేసి సన్నబియ్యం ప్రజలందరికీ అందే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ ప్రెసిడెంట్ ఎం.యాదయ్య, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ జంగయ్య, మాజీ ఎంపీపీలు పర్వతాలు, కొమ్ము మధు, నాయకులు అధికారులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి



ఎల్‌వోసీని అందజేస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురై ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన వారు సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి కోరారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన శివకార్తీక్‌కు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.లక్షా 50వేల ఎల్‌వోసీని ఎమ్మెల్యే మంజూరు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణ రెడ్డి స్వగృహంలో లబ్ధిదారునికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సీఎంఆర్ఎఫ్ ఆరోగ్యభద్రతకు చేయూతగా ని లుస్తుందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలో పేతం చేసి మెరుగైన వైద్య సేవలందించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గుండూరు వెంకటేశ్వర్‌రావు తదితరులు ఉన్నారు.

జర్నలిస్టుల ఆరోగ్యం ఎంతో ముఖ్యం

- ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, రత్నగిరి ఫౌండేషన్ చైర్మన్ జూపల్లి అరుణ్‌కుమార్

- జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం విజయవంతం



నాగర్‌కర్నూల్‌లో జర్నలిస్టుల వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమాజానికి సేవ చేసే జర్నలిస్టుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సాయి గార్డెన్‌లో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో హైదరాబాదు మలక్‌పేట్‌కు చెందిన యశోద ఆసుపత్రి, సనత్ నగర్‌కు చెందిన శ్రీనేత్ర వారి సహకారంతో జర్నలిస్టులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే తోపాటు ఎస్పీ, రత్నగిరి ఫౌండేషన్ చైర్మన్ జూపల్లి అరుణ్‌కుమార్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై వైద్యశిబిరాన్ని ప్రారంభిం చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లే జర్నలిస్టులకు ప్రత్యేక ఓపీ ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం నాయకుల విజ్ఞప్తి మేరకు జర్నలిస్టులకు ఉచిత హెల్మెట్‌లను అందజేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ మాట్లాడుతూ జర్నలిస్టులు వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రవినాయక్, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు విజయ్‌కుమార్, సురేష్‌కుమార్, జాతీయ నాయకులు సుదర్శన్‌రెడ్డి, యూనియన్ ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు పి.వెంకటస్వామి, జాతీయ కౌన్సిల్ సభ్యుడు కన్నయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్యాంసుందర్, అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు నందు యాదగిరి, యశోద ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ శ్వేత, నాయకులు కందికొండ మోహన్, కొండకింది మాధవరెడ్డి, హకీం కిషోర్, వెంకటస్వామి, రాజేందర్‌గౌడ్, సాయి బాబు, శ్రీనివాస్, మల్లేష్, శ్రీశైలం, జయప్రసాద్, డాక్టర్ సలీం, డాక్టర్ దిలీప్‌రెడ్డి, యశోద ఆసుపత్రి కోఆర్డినేటర్ శ్రీధర్, జర్నలిస్టులు శ్రీనుబాబు, రవీందర్‌రెడ్డి, స్ఫూర్తి ఒకేషనల్ కరస్పాండెంట్ సైదులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కరువు

- కొల్లాపూర్ మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో సమస్యలు తెలుసుకున్న బీజేపీ నాయకులు



కొల్లాపూర్ మాతా శిశు సంరక్షణ కేంద్రంలో సమస్యలు తెలుసుకుంటున్న బీజేపీ నాయకులు

కొల్లాపూర్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్‌లోని మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో మౌలిక వసతులు కరువయ్యాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. బుధవారం కొల్లాపూర్ పట్టణంలోని రామాపురం రహదారిలో ఉ న్న మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో గర్భిణుల సమస్యలను బీజేపీ రాష్ట్ర కమిటీ స భ్యుడు సందు రమేష్, నా యకులు తమటం సాయికృష్ణగౌడ్, మేకల శ్రీనివాస్‌యాదవ్, కేతూరి నారాయణ ఆధ్వర్యంలో నాయకులు తెలుసుకున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఉన్న మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో రెగ్యులర్ గైనకాల జిస్ట్, చిన్న పిల్లల డాక్టర్ లేరని తెలి పారు. వారంలో ఒక రోజు బయట నుంచి వచ్చే డాక్టర్ గర్భిణులకు ఓపీ వైద్య సేవలు అందిస్తున్నారని, అది కూడా ఈ రోజు రాలేదని నాయకులు అసహనం వ్యక్తం చేశారు. తాగునీటి వసతి కూడా లేదని, ప్రత్యేక ట్రాన్స్ ఫార్మర్ లేకపోవడంతో విద్యుత్ సమస్యతో డయాలసిస్ రోగులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రెగ్యులర్ డాక్టర్లను నియమించకపోతే పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తమటం శేఖర్ గౌడ్, జిల్లానాయకులు చంద్రశేఖర్‌రావు, భాస్కర్‌గౌడ్, ఓరే శేఖర్, రాజ శేఖర్, రమేష్ యాదవ్, రమేష్‌గౌడ్, రెడ్డి నరసింహ, భరత్‌యాదవ్, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వంతెనలు లేక వణుకు

- బీటీ రోడ్డు నిర్మించినా మంజూరు కాని వంతెన



తిప్పారెడ్డిపల్లి-వంగూరు మధ్య ఎగువ నుంచి వస్తున్న వరద నీరు

వంగూరు, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు కురిస్తే మండలంలోని కొన్ని ప్రాంతాల్లో పొంగిపొర్లే వాగులతో ప్రజలు సతమతమవుతున్నారు. వంతెనలు లేక రహదారిపై పారే నీటితో రాకపోకలు నిలిచి పోయి ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. ఏళ్లుగా ఈ సమస్యతో ఇబ్బందిపడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బీటీ రోడ్డు సరే.. వంతెన ఏదీ ?

వంగూరు నుంచి తిప్పారెడ్డిపల్లి వరకు రూ. 6 కోట్లతో నూతనంగా బీటీ రోడ్డు నిర్మించారు. కానీ, తిప్పారెడ్డిపల్లి గ్రామ సమీపంలో వాగుపై వంతెన నిర్మించలేదు. వర్షం వస్తే రహదారిపై నుంచి వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. తిప్పారెడ్డిపల్లి, గాజర, కోనేటిపూర్ గ్రామాల నుంచి వంగూరు మండల కేంద్రానికి, పొలాలకు ఈ వాగు దాటి వెళ్లాల్సిందే. ఎగువ వర్షం కురిస్తే రాకపోకలు నిలిచిపోతాయి. నీటి ప్రవాహం సమయంలో ప్రమాదం బారిన పడుతున్నారు. పోల్కంపల్లి గ్రామ సమీపంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఎగువ నుంచి వచ్చే నీరు, కేఎల్ఐ కాల్వ నీరువచ్చి రోడ్డుపై చేరడంతో రోడ్డు దెబ్బతిని నీరు నిలిచి మడు గులా తలపిస్తోంది. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి.



పోల్కంపల్లి -కొండారెడ్డిపల్లి మధ్య రోడ్డుపై నిలిచిన వరద నీరు

ప్రతిపాదనలు పంపాం

వంగూరు-తిప్పారెడ్డిపల్లి వరకు నూతనంగా బీటీ నిర్మించాం. వంతెన నిర్మాణానికి గాను ఏడాది కిందట రూ. 3 కోట్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇప్పుడు మళ్లీ కొత్తరేట్ల ప్రకారం ప్రతిపాదనలు పంపిస్తాం. మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. అదేవిధంగా పోల్కంపల్లి వద్ద రోడ్డుపై నిలిచిన నీటి విషయంలో స్థానికులతో మాట్లాడాను. ఎగువ నుంచి వచ్చే నీటిని రోడ్డుపై నీరు నిల్వకుండా చెరువులోకి పంపిం చేందుకు తగు చర్యలు తీసుకొని సమస్యను పరిష్కరిస్తాం.

- లక్ష్మీపతి, ఆర్అండ్‌బీ ఏఈ